క్లుప్తంగా

రేపు రామలింగేశ్వరుడి వార్షిక తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సమీపంలో వేంచేసివున్న రామలింగేశ్వరస్వామి 26 వ వార్షిక తిరునాళ్ల శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు దేవినేని కృష్ణబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచే శివునిడి మహాన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, అలంకరణ, 10 గంటల నుంచి రాత్రివరకు అన్నదానం చేపడుతున్నట్లు చెప్పారు. సాయంత్రం 6.30 గంటలకు నాగ సాధువులచే మట్టి శివలింగరూపంలో కొలువుదీరిన మహాదేవునికి పంచామృతాలతో, వివిధ రకాల పండ్ల రసాలతో రుద్రాభిషేకం, భస్మాభిషేకం, హారతులు నివేదనలు చేపడుతున్నట్లు చెప్పారు. వేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని భక్తుల పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కృష్ణబాబు కోరారు

నేడు గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం

యద్దనపూడి: మండలంలోని అనంతవరం గ్రామంలోని పోపూరి బసవపూర్ణమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ చుండి లక్ష్మినారాయణమ్మ, ఎంపీపీ పులగం రజనీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు డాక్టర్ దగ్గుబాటి రామానాయుడు కల్యాణ మండపంలో శుక్రవారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ దండా చౌదరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన పర్చూరు ఏఎంసీ ప్రాంగణంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం జరుగుతుందని మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు మార్టూరులో ఉరుసు మహోత్సవం

మార్టూరు: మండల కేంద్రం కొణిదెన రోడ్డులో ఉన్న హజరత్ కరిముల్లాషావలి దర్గాకు సంబంధించిన 47వ ఉరుసు కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి 12.30 గంటలకు స్థానిక పీర్ల చావిడి నుంచి గంధం ఊరేగింపుగా బయలుదేరుతుందని దర్గా ముజావర్ నాగూరు సాహెబ్ తెలిపారు. మార్టూరు సీఐ ఫిరోజ్, ఎస్సై కమలాకర్‌లు శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మేదరమెట్ల: అంగన్‌వాడీల్లో క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందజేయాలని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని తమ్మవరంలో గురువారం ఆయన పర్యటించారు. కార్యక్రమంలో భాగంగా సచివాలయం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ విధులు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా సమయపాలన పాటించడం, అటెండెన్స్ వేయడం చేయాలన్నారు. ఎంపీడీవో వెంట సీడీపీవో కృష్ణకుమారి ఉన్నారు.

గొల్లపాలెంలో నేత్రదానం

చినగంజాం: ఇంకొల్లు మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన వల్లభనేని వీర రాఘవయ్య (85)మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయం వైద్యులు మృతుడి కార్నియాలను సేకరించారు. మృతుడి కుమారుడు కేశవరావు, కుమార్తె నాగేంద్రం, భవానీలకు అవయవదాన కమిటీ సభ్యుడు ఎస్ రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి కరి కమలేశ్వర రావు, బీ అంజిరెడ్డి, వీ శ్రీమన్నారాయణలకు అభినందనలు తెలియజేశారు.

శ్రీరాములు త్యాగ ఫలితమే తెలుగు రాష్ట్రం


శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కృష్ణచైతన్య


చీరాల: శ్రీరాములుకు నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్


పర్చూరులో అమరజీవికి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు


వేటపాలెంలో నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, బీరక సురేంద్ర, ఎస్సై సురేష్


నివాళులర్పిస్తున్న రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ సభ్యులు


చినగంజాం: శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

అద్దంకి/అద్దంకి రూరల్: ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములని, ఆయన త్యాగ ఫలితమే తెలుగు రాష్ట్రమని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన గురువారం పట్టణంలోని పాత బస్టాండ్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గాంధీ మార్గంలో నడిచిన వ్యక్తి శ్రీరాములన్నారు. చిన్న వయసులోనే గాంధీ పట్ల ఆకర్షితుడై ఆయన మార్గంలో నడిచారని చెప్పారు. 58 రోజులు ఆమరణ దీక్ష చేయడం వల్లే మనకు తెలుగు రాష్ట్రం వచ్చిందన్నారు. ఆయన చూపిన బాటలో యువత నడవాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశుపద్మేశ్, పార్టీ పట్టణ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరక్టర్ కే భువనేశ్వరి, కౌన్సిలర్లు, వైశ్య నాయకులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

☛ అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు అద్దంకిలో వివిధ సంఘాలు, స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహానికి ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సంఘ సెక్రటరీ, వైఎస్ చైర్మన్‌లు, నాయకులు పాల్గొన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా అద్దంకిలోని పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహానికి రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీకృష్ణ, కోశాధికారి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, గాడేపల్లిదివాకర దత్తు, దేవపాలన, మస్తాన్‌రావు, షేక్ మహమ్మద్ రఫీ, సంకాబాబు, చుండూరి మరళీసుధాకర రావు, బాబుజీ తదితరులు పాల్గొన్నారు.


అద్దంకిలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు


యద్దనపూడి: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న సభ్యులు

శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శం..

పర్చూరు/యద్దనపూడి/కారంచేడు/మార్టూరు/చినగంజాం: పొట్టి శ్రీరాములు జీవితం మనందరికీ ఆదర్శం కావాలని వాసవీ వనితా క్లబ్ ధ్యక్షురాలు అమరా ధనలక్ష్మి అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ మందిర ఆవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్ ఎం శేషకుమారి, వీ హైమావతి, బీ రాజేశ్వరి, వీ జ్యోతి, కే సుభాషిణి, డీ జయలక్ష్మి, ఏ సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళులు..

పర్చూరులో అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన త్యాగాలను పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో బాపనపల్లి భాస్కరరావు, వెంకట సుబ్బారావు, వెంకటేశ్వరరావు, కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

☛ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకై ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామంగా చరితలో నిలిచిపోతుందని వాసవీక్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పోలిశెట్టి హనుమంతురావు అన్నారు. శ్రీరాములు జయంతి పురస్కరించుకొని వాసవీక్లబ్ యద్దనపూడి వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పదో తరగతి చదువుతున్న 62 మంది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు దారా బాలసుబ్బారావు, కార్యదర్శి కొత్తూరి వెంకటరాంబాబు, ట్రెజరర్ పోలిశెట్టి బసవయ్య, వైస్ ప్రెసిడెంట్ టీవీ నరసింహరావు, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు నున్నా రామచంద్ర రావు, హెచ్‌ఎం జంగా పోతురాజు పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి ఎస్సై రత్న కుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై శేషసాయి, రైటర్ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి చిరస్మరణీయుడు..

చీరాల/వేటపాలెం: అమరజీవి త్యాగాలు అజరామరమని ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో పయనించాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు సూచించారు. అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహనీయుల త్యాగ ఫలితంగానే స్వాతంత్య్ర ఫలాలు లభించాయని యువత మహనీయుల ఆడుగుజాడల్లో పయనించాలన్నారు. పొట్టిశ్రీరాములు పోరాటాలను ప్రశంసించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఐజయ్య, వైస్ చైర్మన్లు ఎస్ రామసుబ్బులు, బి.జైసన్‌బాబు, మున్సిపల్‌వార్డు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ఉద్యోగులు ఉన్నారు.

☛ వేటపాలెం రైల్వే స్టేషన్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ సెంటర్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పట్టబద్రుల సంఘం ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీకాంత్, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, ఎస్సై సురేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ శ్రీరాములు త్యాగాన్ని మరువలేమన్నారు. ఆయన చేసిన త్యాగ ఫలమై ఆంధ్రరాష్ట్ర భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పాడిందన్నారు. మరో ముఖ్య అతిథి దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరజీవి జయంతి ప్రభుత్వ కార్యక్రమంగా జరపాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అనంతరం డీఎస్పీ, సురేంద్రను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై జీ సురేష్, పీ వెంకట సుబ్బారావు, సంఘం నాయకులు నున్నా శివప్రసాద్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోటి స్వామి గుప్త, వంకా శ్రీనివాసరావు, కరణం మురళీకృష్ణ, బదరీనాథ్, వాక రామ చంద్రరెడ్డి, గొడవర్తి రామకృష్ణ, పూల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి


మధ్యాహ్న భోజనపథకాన్ని పరిశీలిస్తున్న సంతమాగులూరు ఎంపీడీవో


కొత్తూరులో భోజనాన్ని రుచి చూస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

బల్లికురవ/అద్దంకి రూరల్: ప్రభుత్వం విద్యార్థులకు మంచి పౌష్టికాహారాన్ని అందించేందుకు జగనన్న గోరుముద్దలో ప్రతి రోజు కచ్చితంగా మెనూ పాటించాల్సిందేనని మండల ప్రత్యేకాధికారి కే శ్రీనివాసరావు, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. గురువారం కొత్తూరు, వెలమవారిపాలెం, సచివాలయాలు, పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాధాన్యత భవనాలను తనిఖీ చేశారు. త్వరలో విద్యార్థులకు ప్రతి రోజు రాగిజావ అందిస్తారని చెప్పారు. సచివాలయాలు, ఆర్బీకేలు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సకాలంలో పూర్తిచేసి అప్పగించాలని కోరారు. తనిఖీలో సెక్రటరీలు వాణి, మోహన రంగారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

☛ సంతమాగులూరు మండలంలో నిర్మాణంలో ఉన్న పాధాన్యత భవనాలను సకాలంలో పూర్తిచేసి అప్పగించాలని ఎంపీడీవో సాంబశివరావు కోరారు. మండలంలోని గురిజేపల్లిలోని మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లను తనిఖీ చేశారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం


టీబీపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ

కారంచేడు: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇది ప్రాణాంతకమైన వ్యాధి కాదని సీహెచ్‌వో శాంతిప్రియ అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రం కారంచేడు-2 సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన హెల్త్‌మేళాలో పలు వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలకు వ్యాధి లక్షణాలు, దాని తీవ్రతలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా ఈ వ్యాధికి లక్షణాలు రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో కళ్లె పరీక్షలు చేయించుకోవాలన్నారు. దీనితో పాటు తరచుగా జ్వరం, బరువు తగ్గడం, దగ్గినప్పుడు కళ్లె పడటం, ఆకలి మండగించడం వంటి లక్షణాలు ఉన్నా వెంటనే మీ ఏఎన్‌ఎంలు, ఆశల సహకారంతో టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది మీకు ఉచితంగా మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ తిరుపతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలు, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

పర్చూరు: స్థానిక ఏఎంసీ నందు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న శనగల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించనున్నట్లు ఏవో ఎస్ రామమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కొనుగోలు కేంద్రంను వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ చేతుల మీదగా ప్రారంభిస్తామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులు కార్యక్రమంలో పాల్గొని, కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పంచాయతీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ

చినగంజాం: పంచాయతీ సిబ్బందికి పెదగంజాం ఈఓపీఆర్డీ కే స్వరూపరాణి గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ సిబ్బందికి వస్త్రాలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమలో పంచాయతీ కార్యదర్శి ఎం భారతి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం


మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

చినగంజాం: మారుమూల గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని అభివృద్ధి సాధించాలని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. గ్రామ వికాస్ పీస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో స్థానిక మహాలక్ష్మి కాలనీలో నిర్మాణం చేసిన ఆఫ్టర్ స్కూల్ స్టడీ సెంటర్ నూతన నిర్మాణాన్ని ఆమె ప్రారంభించారు. పిల్లలు బాగా చదువుకొని మంచి ఉద్యోగాలు చేయాలని, తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో మహాలక్ష్మి కాలనీ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు మస్తానమ్మ, ఐ పద్మ, సామ్రాజ్యం , కోటేశ్వరమ్మ, సంస్థ సీఓలు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబురావు

చీరాల రూరల్: ప్రేమ హార్ట్ అండ్ డయాబెటిస్ ఆస్పత్రి అధినేత, రోటరి క్లబ్ చీరాల అధ్యక్షుడు డాక్టర్ విస్తర్ల బాబురావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మద్దిబోయిన సుబ్రహ్మణ్యానికి మందుల ఖర్చుల నిమిత్తం రూ. 7,000 ఆర్థిక సాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గురువారం స్థానిక రోటరి కమ్యూనిటి హాలులో బాధితుడి తల్లి వైకుంఠపురానికి చెందిన లక్ష్మికి సాయం అందజేశారు.

ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు


కొండమూరులో నిర్వహిస్తున్న రైతు గ్రామసభ

జే.పంగులూరు: ఈ-క్రాప్ నమోదుతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండమూరు గ్రామంలో గురువారం రైతులకు ఏవో ఆధ్వర్యంలో గ్రామ సభని ర్వహించారు. సభ నుండు రైతులను ఉద్దేశించి ఏవో మాట్లాడుతూ 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు తుది జాబితా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శిస్తామని తెలిపారు. వీటిలో ఏవైనా ఫిర్యాదులు ఉంటే వెంటనే రైతు భరోసా కేంద్రంలో సరిచేస్తారని, ఈ అవకాశం ఈ నెల 25 వరకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ అంజిరెడ్డి, వీఏఏ దినేష్, రైతులు పాల్గొన్నారు.

ఆమంచిని కలిసిన నాయకులు


ఆమంచితో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

పర్చూరు: మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ను పర్చూరు మండల రెవెన్యూ ఆఫీస్‌లో మర్యాద పూర్వకంగా కలిసి దుశాలువాతో సత్కరించారు. అనంతరం వారు పలు సమస్యలపై ఆయన చర్చించారు. కార్యక్రమంలో యద్దనపూడి మండల నాయకులు మారేళ్ల విజయ్కృష్ణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఐమాల శాంసన్, యనమదల గ్రామ సర్పంచ్ రాయి పృథీ్వ, ఎస్సీ సెల్ అధ్యక్షులు పాలెపోగు రాంబాబు, సూరవరపుపల్లె సర్పంచ్ వెంకటప్పయ్య, మున్నంగివారిపాలెం సర్పంచ్ మున్నంగి బసివిరెడ్డి, వింజనంపాడు సర్పంచ్ తూబాటి బాలకృష్ణ, గన్నవరం సర్పంచ్ పల్లెపోగు పోతురాజు, ఉపసర్పంచ్ చెరుకూరి వేణు, పోలూరు నాయకులు దొడ్డా రవి, ఎంపీటీసీ షేక్ ఖాసీం వలీ, సోషల్ మీడియా కన్వీనర్ మున్నంగి వీరయ్య, చింతపల్లిపాడు నాయకులు జంపాని వాసు, జంపాని రాజేష్, పులగం చందు, గొర్రె సురేష్, నవీన్ బుల్లి, జంగా ఏలీయా తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తిచేయాలి


చీరాలనగర్‌లో సూచనలందిస్తున్న తహసీల్దార్


అద్దంకి: మాట్లాడుతున్న తహసీల్దార్

చీరాల టౌన్: లబ్ధిదారుడు సొంతింటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ఉగాది పండుగ రోజు గృహప్రవేశాలు చేయాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. గురువారం మండలంలోని చీరాలనగర్-1,2 లేఅవుట్లలో జరుగుతున్న జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

అద్దంకి: జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు పొంది గృహం మంజూరైనవారంతా బేస్‌మెంట్లు వేయాలని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన మండలంలోని కొంగపాడు గ్రామ సమీపంలోని జగనన్న కాలనీని సందర్శించారు. పరిశీలనలో ఆయన వెంట స్థానిక అధికారులు, లబ్ధిదారులు ఉన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏంపీడీవో విజయలక్ష్మి

చినగంజాం: ఉద్యోగులు తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీడీవో డీ విజయలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండలంలోని కడవకుదురు సచివాలయం-2, గొనసపూడి సచివాలయాలను సందర్శించారు. ముందుగా ఆమె ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాలను సందర్శించారు. భోజనం నాణ్యత, మెనూ, విద్యార్థుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. సామాజిక మరుగుదొడ్ల నిర్మాణాలను, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. సచివాలయాల్లోని సిబ్బంది పనితీరు, బయోమెట్రిక్ హాజరు, సచివాలయం ద్వారా అందుతున్న సేవలు గురించి ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలి

బల్లికురవ: ఉపాధి హామీ పథక పనుల్లో గ్రామాల వారీగా కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ రాజేష్ కోరారు. గురువారం బల్లికురవలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పనిముట్లతో ఉదయం 6 గంటలకే పని ప్రదేశంలో చేరి 11 గంటల వరకు పని చేయాలన్నారు. గ్రూపులు, టీమ్‌లు ఏర్పడి మేట్‌లు కూడా పనిచేస్తే ఒక్కో కూలికి రూ. 257 తగ్గకుండా కూలీ పొందవచ్చన్నారు.